క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



తుమ్మలపల్లి(కర్లపాలెం): పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. తుమ్మలపల్లి గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీడీవో శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. అనంతరం సచివాలయానికి వెళ్లి సిబ్బంది హాజరు పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతి వీధికి వెళ్లి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా వీధులను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చెరుకుపల్లి: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని చాకచక్యంగా అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్లు నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మార్తురి శ్రీరాం ప్రసాద్ శనివారం తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని గూడవల్లి గ్రామంలో సీఐ తన సిబ్బందితో గస్తీ తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన మొర్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ప్లాస్టిక్ క్యానుతో అనుమానంగా సంచరిస్తుండగా అతని వద్ద ఉన్న డబ్బాను పరిశీలించి అందులో ఐదు లీటర్ల నాటు సారా ఉన్నట్లు గుర్తించి వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది కె.శ్రీనివాసరెడ్డి, కె.ముధుసుధన్‌రావు, వెంకట రమణ పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గోపీ

రేపల్లె రూరల్: బాపట్ల జిల్లా ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రేపల్లెకు చెందిన గోపీ ఎంపికయ్యాడు. బాపట్లలో జరిగిన జిల్లా కమిటీ ఎన్నికలలో గోపీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఉన్న 259 మంది ఎండీయూ ఆపరేటర్‌ల పక్షాన నిలబడి సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

తహసీల్దార్ పద్మావతి



చెరుకుపల్లి: ఎరువుల దుకాణదారులు రైతులకు ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి హెచ్చరించారు. మండల పరిధిలోని రాంబొట్లపాలెంలోని లక్ష్మీ శ్రీనివాస జనరల్ ట్రేడర్స్, మాధురి ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణాల్లో శనివారం తహసీల్దార్ పద్మావతి మండల వ్యవసాయ అధికారి ఎ.మహేష్‌బాబు, సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలు తనిఖీ చేయటం జరిగిందన్నారు. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా స్టాక్‌బోర్డు, ధరల పట్టికతో పాటు రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర పథకాలు అమలు చేయాలి

చెరుకుపల్లి: కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికి అందే విధంగా అధికారులు పర్యవేక్షించాలని న్యూఢిల్లీ నీతి ఆయోగ్ ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్ అధికారులకు సూచించారు. మండలంలోని ఆరుంబాక రైతు సేవా కేంద్రంలో శనివారం కేంద్ర బృందం రైతులతో సమీక్ష నిర్వహించారు. తొలుత గ్రామ సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు, అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వికాస్ మల్కర్ మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన కింద అమలవుతున్న ఐదు రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ నియమించిన సంభోది రీసెర్చ్ కమ్యూనికేషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా సర్వే నిర్వహించేందుకు మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఆరుంబాక, కనగాల గ్రామాలను ఎంపిక చేయటం జరిగిందని తెలిపారు. ఈ గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు విడివిడిగా కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు అవుతున్నాయా లేదా అని స్వయంగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ కేంద్ర బృందం సభ్యులు వి.సంధ్యారాణి, భానుచందర్, జి.సంధ్యారాణి, లోకేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిబంధనలు పక్కాగా...

- మార్చి 1 నుంచి కచ్చితంగా మోటారు వాహనాల చట్టం అమలు
- ఉల్లంఘిస్తే జరిమానాలు, లైసెన్సులు రద్దు
- ప్రాణ నష్టం తగ్గించేందుకే కఠిన ఆంక్షలు

హెల్మెట్ తప్పనిసరిగా వాడాల్సిందే



హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులు



సెల్‌ఫోన్ మాట్లాడుతూ...

రేపల్లె రూరల్: రోజురోజుకు పెరిగిపోతున్న రహదారి ప్రమాదాలలో ప్రాణ నష్టాలను తగ్గించేందుకు అధికార యంత్రాంగం మోటారు వాహన చట్టాలను కఠినతరం చేయనుంది. న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు మార్చి 1వ తేదీ నుంచి నూతన మోటారు వాహనాల చట్టం అమలులోకి రానుంది. రహదారి ప్రమాదాలను తగ్గించడంతోపాటు వాహన చోదకుల్లో రహదారి ప్రమాదాలపై అవగాహన పెంపొందించి వేగ నియంత్రణను అదుపులోకి తెచ్చేందుకే ఈ చట్టాలను కఠినంగా అమలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మార్చి 1 నుంచి మోటార్ వాహన చట్టం పక్కాగా అమలు చేస్తామని చెబుతున్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే జరిమానాలు విధించటంతో పాటు తరచూ చట్టాన్ని ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకే

నిత్యం వాహన చోదకులు అతివేగంగా వెళుతూ తమతో పాటు ఇతరులను సైతం ప్రమాదాలకు గురిచేయటం, మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై కన్నవారికి కడుపుకోత మిగల్చటం, అతివేగంగా వాహనాలు నడిపి పలువురిని ఇబ్బందులకు గురిచేసే ఆకతాయిల ఆగడాలను నిరోధించేలా నూతనంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది. దీంతో చట్టాన్ని మార్చి నెల నుంచి కఠినంగా అమలు చేస్తున్నట్లు పోలీసు, రవాణా శాఖ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. చట్టాన్ని కఠినంగా అమలు చేయటంతో పాటు వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ప్రజలు, ప్రజా సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వాహనం సీజ్

తరచూ చట్టాన్ని ఉల్లంఘించే వాహన చోదకులపై కఠిన చర్లకు సిద్ధమయ్యారు. డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చెయ్యనున్నారు. అదేవిధంగా 90 రోజులలోపు జరిమానాలు చెల్లించని వాహనాలను సీజ్ చేయనున్నారు. ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాల్సిందేనని చట్టంలో పొందుపరిచారు. లేని పక్షంలో పెనాల్టీలు చెల్లించక తప్పదు.

■ హైకోర్టు ఉత్తర్వుల మేరకు మార్చి 1 నుంచి నూతన మోటార్ వాహన చట్టం అమల్లోకి రానుంది. దాని ప్రకారం జరిమానాలు విధిస్తారు. దీనికి అనుగుణంగా పోలీసుల సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయ్యింది. హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే ప్రస్తుతం విధిస్తున్న జరిమానాలు రెట్టింపు చేసి రూ.వెయ్యికి పెంచారు. లైసెన్సు లేకుండా నడిపితే రూ.10 వేల జరిమానా విధిస్తారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, రవాణా శాఖ అధికారులతో గొడవకు దిగినా, సమాచారం ఇచ్చేందుకు నిరాకరించినా కేసులు నమోదు చేస్తారు.

పెనాల్టీలు ఇలా...

వివరం	జరిమానా(రూపాయల్లో)
హెల్మెట్ లేకపోతే	1,000
వెనుక కూర్చున్న వ్యక్తికి లేకపోతే	1,000
బీమా లేకపోతే	1,000
రెండవసారి పట్టుబడితే	2,000
శబ్ద కాలుష్యంకు	2,000
రెండవసారి చేస్తే	4,000
రవాణా వాహనాల్లో ప్రయాణికులను ఎక్కిస్తే ఒక్కొక్కరికి	200
మైనర్ డ్రైవింగ్	1,000
ప్రమాదకర పార్కింగ్	1500-3000
రేసింగులకు పాల్పడితే	5,000
రెండవసారి పాల్పడితే	10,000
ప్రమాదకరంగా డ్రైవింగ్	1,500-10,000
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే	10,000

నిబంధనలు పాటించాల్సిందే



రహదారి ప్రమాదాలను నివారించి ప్రమాదాలలో ప్రాణనష్ట అంచనాలను తగ్గించేందుకు న్యాయస్థానం నూతన వాహన చట్టాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మార్చి 1వ తేది నుంచి నూతన చట్టం అమల్లోకి రానుంది. హెల్మెట్‌తో ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురైనా ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. ఇప్పటికే పట్టణంలో తరచూ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తున్నాం. ప్రతి వాహన చోదకుడు రహదారి నియమ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలి.

– మల్లికార్జునరావు, సీఐ, రేపల్లె

సత్ప్రవర్తనతో కూడిన నడవడికను అలవరుచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



రిమాండ్ ఖైదీలకు సూచనలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: సత్ప్రవర్తనతో కూడిన నడవడిక జీవితాలను బంగారుమయం చేస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు చెప్పారు. పట్టణంలోని సబ్ జైలులో రిమాండ్ ఖైదీలకు శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసే తప్పిదాలతో జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. ఇకనుంచైనా ఖైదీలు సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంభించాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విరామ సమయంలో పుస్తక పఠనం అలవరుచుకోవాలని సూచించారు. సమాజంలో జీవించేందుకు అవసరమైన వృత్తుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. నేరం ఆరోపించబడి రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు ప్రభుత్వ పరంగా న్యాయ సేవలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పలు న్యాయ సేవా చట్టాలను వివరించారు. సదస్సులో సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగపూర్వక విద్యతో చిన్నారులకు మేలు

సీడీపీవో సుచిత్ర



నమూనాలతో బోధించే విధానాన్ని అంగన్‌వాడీలకు వివరిస్తున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె రూరల్: చదివిన దాని కంటే చూసి నేర్చుకునే అంశాలు చిన్నారుల మదిలో జీవితకాలం పాటు గుర్తుండిపోతాయని సీడీపీవో సుచిత్ర తెలిపారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 3వ వార్డు ఎంపీహెచ్ఎస్ స్కూలు, ఇసుకపల్లిలోని ట్రిబుల్ ఎస్ స్కూలులో అంగన్‌వాడీ కార్యకర్తలకు నమూనా విద్య ప్రాముఖ్యతను ఆమె వివరించి మాట్లాడారు. వాస్తవాలకు ప్రతిరూపాలైన నమూనాలతో చిన్నారులకు బోధించాలని, అప్పుడే ఆ బోధన ఆసక్తిదాయకంగా ఉంటుందన్నారు. సృజనాత్మకత, సామాజిక భావోద్వేగ అభివృద్ధి అలవడతాయన్నారు. తక్కువ ధరలకు లభించే బోధనా సామగ్రిని బోధనలో భాగస్వామ్యం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా బోధనా సామగ్రి ఉపయోగిస్తూ బోధించే విధానం, తల్లిదండ్రులతో చిన్నారుల స్థితిగతులతో చర్చించటం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌జీటీలు టి.సురేష్, ప్రభాకర్, సూపర్‌వైజర్ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అమరలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమరలింగేశ్వరస్వామి



లలితా పరబ్రహ్మేశ్వరి అమ్మవారు

రేపల్లె రూరల్: మండలంలోని కారుమూరు గ్రామంలో పునర్నిర్మించిన లలిత పరబ్రహ్మేశ్వరి సమేత అమరలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన అనంతరం 16 రోజులను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి, అమ్మవారికి వేకువ జాము నుంచి సుప్రభాత సేవ, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని వెండి ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో శ్రీలలితా సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ యడం వెంకట సునీల్, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, నిర్వాహకులు గుడి ఆమణికంత, అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన ఎరువులు, విత్తనాలనే విక్రయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ విజయ్‌బాబు

రేపల్లె రూరల్: రైతులకు నాణ్యతతో కూడిన ఎరువులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు అన్నారు. పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలలో శనివారం తనిఖీ నిర్వహించి మాట్లాడారు. నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. దుకాణాలలో స్టాకు వివరాలను, విక్రయాలను రికార్డులలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు తదితర వస్తువుల ధరల వివరాలతో దుకాణాల ఎదుట బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలలో రికార్డులను తనిఖీ చేసి గోదాములలోని సరుకులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా

సాక్షి ఎఫెక్ట్



పైప్‌లైన్‌కు మరమ్మతులను చేపట్టిన అధికారులు



కుళాయి నీటిని పట్టుకుంటున్న యువకుడు

నగరం: మండలంలోని శిరిపూడి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై శనివారం సాక్షిలో ప్రచురితమైన 'నీరు వచ్చేనా..?' కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలోని మినీ రక్షిత నీటి పథకం మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గత మూడు నెలలుగా తాగునీటి కోసం తంటాలు పడిన ఎస్సీ కాలనీ వాసులు తాగునీటిని సరఫరా చెయ్యడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నెల్లెమ్మతల్లి ఆలయంలో వైభవంగా 16 రోజులు పండుగ



చెరుకుపల్లి: ఆరుంబాక గ్రామంలో వేంచేసియున్న నెల్లెమ్మ, ముత్యాలమ్మ తల్లి, పోతురాజుల విగ్రహాలను ప్రతిష్ఠించి 16 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం అమ్మవారి ఆలయంలలో 16 రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువు దీరిన అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు చెరుకుపల్లి రామ సుబ్బారావు శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి గాజులు, చీర జాకెట్టు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రావూరి శివనాగేశ్వరరావు, పూల కోటేశ్వరరావు, తోట అప్పయ్య, మల్లెల కోటేశ్వరరావు, కంకి శ్రీనివాసరావు, పూల గిరిప్రసాద్, రావూరి ఉమామహేశ్వరరావు, తోట మధుసూధనరావు, రావూరి రాంప్రసాద్, పెదకాపు రావూరి వెంకట సుబ్బయ్యలు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పర్యావరణానికి పాలిథిన్ పెద్ద శత్రువు

–మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: పర్యావరణానికి పాలిథిన్ పెద్ద శత్రువని, పాలిథిన్‌ను నివారించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు పిలుపునిచ్చారు. పాలిథిన్ నివారణలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అధికారులు, పారిశుధ్య సిబ్బంది పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ పాలిథిన్ వినియోగం ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయిందని, దీంతో ఉపయోగం కంటే హాని ఎక్కువగా ఉందన్నారు. ఉపయోగించి పడవేసిన కవర్లు భూమిలో కలిసిపోవాలంటే వందల సంవత్సరాలు పడుతుందని, ఆ కవర్లతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. పాలిథిన్ కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించి పర్యావరణాన్ని కాలుష్య కోరల నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గన్నీ బ్యాగ్‌లు, గుడ్డ, జనపనార సంచులను వినియోగించి పర్యావరణ హితులుగా మారవచ్చన్నారు. దుకాణదారులు, ప్రజలు వ్యర్థ పదార్థాలను రహదారులపై పడవేయరాదన్నారు. పారిశుధ్య సిబ్బందికి అందించి స్వచ్ఛ రేపల్లె సాధనలో సభ్యులుగా మారాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఓల్డ్ టౌన్ అంకమ్మ చెట్టు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలి



పట్టభద్రులు ఎన్నికల ప్రచారంలో రమాదేవి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు నరసింహారావు

చుండూరు(వేమూరు): శాసన మండలిలో ప్రజావాణి వినిపించే నాయకుడు కేఎస్ లక్ష్మణరావు అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలో పలు విద్యా సంస్థల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల కోసం కేటాయించిన స్థానాల్లో వారికి ప్రాతినిధ్యం ఇవ్వడం ద్వారానే ప్రజల హక్కులు కాపాడబడతాయన్నారు. దేశ వ్యాప్తంగా వస్తున్నవంటి ఆర్థిక, రాజకీయ సామాజిక మార్పుల్లో భాగంగా రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రభుత్వ విధానాలపై చట్ట సభలో గట్టిగా మాట్లాడలేనటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. శాసన మండలిలో ప్రజావాణి వినిపించే పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని ఆమె కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల, కార్మికులు, రైతులు, కూలీలు, మహిళలు, దళితల సమస్యలపై నిరంతర పోరాటం చేసే నాయకుడు లక్ష్మణరావు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, ప్రజా సంఘాల నాయకులు కె.శ్రీమన్నారాయణ, కె.వెంకట రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపులో పట్టభద్రులు భాగస్వాములు కావాలని రైతు సంఘం నాయకులు డి.నరసింహారావు అన్నారు. లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్టణంలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై గళం విప్పి మాట్లాడే అవకాశాన్ని లక్ష్మణరావుకు అందించాలని పిలుపునిచ్చారు. లక్ష్మణరావు గెలుపుతోనే నిరుద్యోగ, ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులు ఎటువంటి ప్రలోభాలకు గురవ్వకుండా తమ అమూల్యమైన ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, నాయకులు బీఎల్‌కే ప్రసాద్, కే సాయిప్రసాద్, అగస్టీన్, రమేష్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించేందుకు ఎక్స్‌పో దోహదం

తెనాలి అర్బన్: మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ఎక్స్‌పో దోహదపడుతుందని నెహ్రూ నికేతన్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసు రోడ్డులోని స్కూలులో నాలుగు రోజులుగా నిర్మిస్తున్న అకాడమిక్ ఎక్స్‌పో శనివారంతో ముగిసింది. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న వివిధ అంశాలకు సంబంధించిన నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు.

పోరాటాలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలి

నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



మాజీ సర్పంచ్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): గ్రామంలోని ప్రజల సమస్యలపై పోరాటాలు చేసి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని వేటపాలెం మాజీ సర్పంచ్ కంతమనేని శ్రీనివాసరరావుతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజల సమస్యలను పక్కన పెట్టి పార్టీ నాయకులను అరెస్టులు చేయడం, దాడులు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని ఆయన సూచించారు. ప్రతి కార్యకర్త, నాయకులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో కొంత మంది మహిళలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవడం జరిగిందని ఈ సందర్భంగా మహిళలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆశ పడి మా వేలుతో మా కంటిని మేమే పొడుచుకున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరరావు, జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్, భాస్కర్ రెడ్డి, పవన్ రెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అమర్తలూరులో పల్లె నిద్ర



అమర్తలూరు(వేమూరు): పల్లె నిద్ర ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పల్లె నిద్ర ఏర్పాటు చేయడం జరుగుతుందని అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించడానికి పల్లె నిద్ర సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని ప్రజల నుంచి సేకరించి, ఆ గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీసులు, ప్రజలు కలసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జానకి అమర్ వర్ధన్, పోలీసులు పాల్గొన్నారు.